సర్కారుపై శిగమూగిన తెలంగాణ

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు

పంటలు మునిగాయి.. పరిహారం ఇవ్వండి

బెజ్జూర్‌లో రైతుల ధర్నా

బెజ్జూర్, అక్టోబర్ 25 : ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో పంటలు నష్టపోయామని, వెంటనే పరిహారం చెల్లించాలని శుక్రవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో రైతులు ధర్నా నిర్వహించారు. వ్యవసాయ అధికారుల తప్పిదంవల్లే తీవ్రంగా నష్టపోయామని, నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కౌటాల సీఐ ముత్యం రమేశ్ రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం తహసీల్దారు భూమేశ్వర్‌కు వినతిపత్రం అందించారు.

చౌటుప్పల్ 65వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న భూ నిర్వాసితులు

ట్రిపుల్ ఆర్ రైతుల రాస్తారోకో

చౌటుప్పల్, అక్టోబర్ 25 : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ 65వ జాతీయ రహదారిపై ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితులు శుక్రవారం రాస్తారోకో చేశారు. అంతకుముందు మూడో రోజు అవార్డు విచారణను బహిష్కరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు భూములు ఇవ్వమని, ప్రభుత్వం తక్షణమే అలైన్‌మెంట్ మార్చాలని రైతులు డిమాండ్ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, భూ నిర్వాసితులు గుజ్జుల సురేందర్ రెడ్డి, దబ్బేటి రాములు గౌడ్, సందగళ్ల మల్లేశం గౌడ్, బోరెం ప్రకాశ్ రెడ్డి, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, జాల శ్రీశైలం యాదవ్, జాల వెంకటేశం యాదవ్, చింతల సుధాకర్ రెడ్డి, తదితరులున్నారు.

- ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట, నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని యంచలో అఖిలపక్ష నేతలు రాస్తారోకో చేపట్టారు. తహసీల్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం సమర్పించారు. నాగిరెడ్డిపేట/నవీపేట

కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో ఆందోళనకారులపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

కాంగ్రెస్ నాయకుడిపైకి కర్రలతో దాడికి వెళ్తున్న మహిళలను అడ్డగిస్తున్న పోలీసులు

రేవంత్ బంటును తరిమిన రైతులు

మొదటిపేజీ తరువాయి...

శుక్రవారం ఉదయం జరిగిన సంఘటన ఇది. ఈ హఠాత్పరిణామంతో సదరు కాంగ్రెస్ నేత, దుగ్యాల కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేఖర్ గజగజ వణికిపోయాడు. పోలీసులను రక్షణ వేడుకొని గ్రామ పంచాయతీ కార్యాలయంలో తలదాచుకున్నాడు. అప్పటికీ ఆగ్రహం చల్లారని రైతులు, మహిళలు, యువకులు జీపీ గదిని చుట్టుముట్టారు. పక్కనే ఉన్న హైమాస్ట్ లైట్ స్తంభంతో గది తలుపులు బద్దలుకొట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఓవైపు పదులు సంఖ్యలో రైతులు.. మరోవైపు అదేస్థాయిలో పోలీసులు.. ఏం జరుగుతుందోనన్న భీతావహ వాతావరణం నెలకొంది. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సదరు నేత బిక్కచచ్చిపోయి అందులోనే ఉండిపోయాడు. ఎస్పీ, అదనపు కలెక్టర్ వచ్చి రైతులకు నచ్చజెప్పడంతో ఎట్టకేలకు శేఖర్‌ను పోలీసులు అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. ఈ ఘటనతో ఫార్మా కంపెనీల కోసం లగచర్లలో నిర్వహించాలనుకున్న ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభం కాకుండానే అధికారులు విరమించుకొని తిరుగుముఖం పట్టారు.

775 ఎకరాల కోసం అభిప్రాయ సేకరణ

కొడంగల్ ప్రాంతంలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం గత కొన్ని నెలలుగా కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, రోటిబండతండా, పులిచర్ల కుంట తండాల పరిధిలో 1375 ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. ఇందులో 600 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండగా మిగిలిన 775 ఎకరాల వరకు రైతుల వద్ద సేకరించాల్సి ఉన్నది. అందులో భాగంగా దుద్యాల మండలం లగచర్లలో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ మేరకు స్థానిక అధికారులు టెంట్లు, ఇతర అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 9గంటలకు ప్రజాభిప్రాయ సేకరణను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. కానీ ఒక్కసారిగా అక్కడ కలకలం రేగింది. కార్యక్రమంలో పాల్గొనేందుకు దుద్యాల కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, సీఎం రేవంత్‌కు అనుచరుడైన శేఖర్ హైదరాబాద్ నుంచి బయలుదేరి వచ్చాడు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రోటిబండతండా మీదుగా సమావేశం వద్దకు రావాల్సి ఉండగా తండా వద్ద గిరిజన రైతులు శేఖర్ వాహనాన్ని అడ్డుకున్నారు. ఒకటి, రెండెకరాల చొప్పున భూములు ఉన్న తమను రోడ్డున పడేయొద్దని, ఆది నుంచి ఫార్మా కంపెనీల ఏర్పాటు ప్రతిపాదనను నువ్వే ముందుకు తీసుకుపోతున్నావంటూ రైతులు శేఖర్‌ను నిలదీశారు. వారికి నచ్చజెప్పాల్సిన సదరు నేత తన అధికారదర్పాన్ని ప్రదర్శించినట్టు గిరిజన రైతులు తెలిపారు.

కుల దూషణ చేశాడు.. అందుకే దాడి చేసినం

తాము మొదట శేఖర్ కారుకు అడ్డుగా నిలబడి నినాదాలు చేశామని రైతులు, మహిళలు తెలిపారు. అయితే అతడు కారు అద్దాన్ని కిందికి దించి తమను కులదూషణ చేశాడని చెప్పారు. 'నేను తలుచుకుంటే ఏమైనా చెయ్యగలను. మీరెంత. మీరు ఒప్పుకున్నా.. లేకున్నా భూములను సర్కార్ బలవంతంగా తీసుకుంటది. నేను ఒక్క మాట చెప్తేచాలు. ఏదో ఇచ్చింది తీసుకొని మూస్కొని ఉండండి. నేను సీఎం రైట్ హ్యాండ్‌ను తెలుసు కదా' అంటూ పోజులు కొట్టాడని రైతులు తెలిపారు. కారు దిగి తమపైనే దాడికి యత్నించాడని, అందుకే అతడికి బుద్ధి చెప్పాల్సి వచ్చిందని చెప్పారు. శేఖర్ వాహనంపై దాడి చేయడంతో పాటు అతడిని అందులోంచి దింపి దాడికి దిగారు. మహిళలు కూడా పెద్ద ఎత్తున వచ్చి కర్రలతో దాడి చేశారు. సమీపంలో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు వెంటనే గిరిజన రైతులను అడ్డుకొని శేఖర్‌ను తీసుకెళ్లి తండాలోని పంచాయతీ గదిలో ఉంచి, ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. అప్పటికే భారీ పోలీసు బలగాలతో లగచర్లలోనే ఉన్న పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అక్కడికి వెళ్లారు. అప్పటికే శేఖర్‌ను తమకు అప్పగించాని రైతులు గదిచుట్టూ గూమిగూడారు. పక్కనే ఉన్న ఇనుప స్తంభం (పోల్)ను తీసుకొని తలుపులు బద్దలు కొట్టేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చివరికి లాఠీచార్జీ చేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

హుటాహుటిన తండాకు ఉన్నతాధికారులు

ఎస్పీ నారాయణ, అదనపు కలెక్టర్ లింగానాయక్ వచ్చి తండా రైతులతో సమావేశమయ్యారు. వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కుల దూషణ చేసి తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినందునే శేఖర్‌పై దాడి చేశామని రైతులు వివరించారు. తమ తాతలు తిండి తినక కూడబెట్టి కొన్న భూములను ప్రభుత్వానికి అప్పనంగా ఎందుకివ్వాలని ప్రశ్నించారు. పచ్చని పొలాల్లో కంపనీలు పెట్టి తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఏనాడూ తాము కోరలేదని చెప్పారు. తమ ప్రశాంతతను దెబ్బతీసి 8 నెలలుగా నిద్ర లేకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనంతటికీ ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులే కారణమని, రైతులెవరినీ సంప్రదించకుండా ఈ ప్రాంతంలో సెంటు భూమి కూడా లేని శేఖర్, శ్రీనివాస్ (హకీంపేట), సంజీవరెడ్డి (హకీంపేట), నర్సింహ (పోలేపల్లి), సింగర్ నర్సింహ (పోలేపల్లి) ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం కుట్రలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. 8నెలల కిందటే వీరితో పాటు దుద్యాల తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్, కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్, టీఎస్ఐఐసీ అధికారి శ్రవణ్‌కుమార్ సమావేశమై... రైతులకు సంబంధం లేకుండానే ఈ ప్రాంతంలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు తీర్మానం చేసినట్టు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి ఏనాడూ రైతులతో మాట్లాడిన పాపాన పోలేదని, తమ బాధలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎకరాకు రూ.10 లక్షలు, ఇంటికో ఉద్యోగం, 125 గజాల ఇంటి స్థలం ఇస్తామని ఎరేస్తున్నారని, కోట్లాది రూపాయల విలువ చేసే భూములకు ప్రభుత్వం ఇచ్చే రూ.10 లక్షలు ఏ మూలకు సరిపోతాయని నిలదీశారు. రైతుల ఆవేదన విన్న అధికారులు తాము ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పి అభిప్రాయ సేకరణ చేయకుండానే వెళ్లిపోయారు.

పెట్రోల్ పోసుకున్న యువకుడు..!

తమ భూములు కాపాడుకునేందుకు ప్రాణాలైనా అర్పించేందుకు సిద్ధమంటూ ఓ యువకుడు పెట్రోల్ పోసుకునేందుకు ప్రయత్నించాడు. పోలీసులు, స్థానికులు గుర్తించి వెంటనే పెట్రోల్ బాటిల్‌ను లాక్కున్నారు. 'మా కడుపులు కాలుతున్నయ్.. మా బాధలు ఎవరితో మొరపెట్టుకోవాలి.. మా ఆకలి బాధలు సీఎం పట్టించుకుంటలేడు. మేం ఎవరి జోలికి పోము.. మా జోలికి వస్తే వదిలేది లేదు' అని యువకుడు హెచ్చరించాడు.

బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాభవన్ ఎదుట గురుకుల అభ్యర్థుల ఆందోళన

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత నోటిఫికేషన్‌లోనే బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని గురుకుల అభ్యర్థులు శుక్రవారం హైదరాబాద్‌లోని జ్యోతిబా పూలే ప్రజాభవన్ ఎదుట ఆందోళనకు దిగారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలతో హోరెత్తించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ పోస్ట్‌లను అర్హులతో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పత్తి కొనుగోళ్ల లో జాప్యం

- కొనుగోలుకు నిరాకరించిన పత్తి వ్యాపారులు
- ఎనుమాముల మార్కెట్‌లో 4 గంటలు నిలిచిన వేలం పాట

కాశీబుగ్గ, అక్టోబర్25: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లలో 4 గంటల పాటు జాప్యం జరిగింది. దీంతో రైతులు, కార్మికులు ఇబ్బందులకు గురయ్యారు. మార్కెట్ కమిటీ పరిధిలోని పత్తియార్డులో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు పత్తికి వేలం పాట నిర్వహిస్తుండగా రైతు సంఘం నాయకుడు మోర్తాల చందర్‌రావు బృందం అక్కడకు వచ్చింది. వెంటనే ఖరీదు వ్యాపారులు రైతు సంఘం నాయకులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరగా.. తాము వేలంపాట పరిశీలిస్తామని చెప్పారు. దీంతో సంఘం వారు ఉంటే తాము పత్తిని కొనుగోలు చేయలేమని ఖరీదు వ్యాపారులు బయటకు వెళ్లిపోయారు. రైతు సంఘం నాయకుడు మోర్తాల చందర్‌రావు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంతలో కార్యదర్శి పోలెపాక నిర్మల ఘటనా స్థలానికి చేరుకొని వెంటనే రైతు సంఘం నాయకులను మార్కెట్ ప్రధాన కార్యాలయానికి రావాలని కోరగా.. వారు వెళ్లకపోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకున్నది. పోలీసులు చేరుకొని అక్కడ రైతు సంఘం నాయకులతోపాటు చాంబర్ ప్రతినిధులు, పత్తి ఖరీదు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. రైతు సంఘం ప్రతినిధులు రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ఖరీదు వ్యాపారులపై పెత్తనం చేయకూడదని చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి సూచించారు.

పత్తి రైతులకు వాట్సాప్ సేవలు

- వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా నిర్వహణ
- 8897281111లో సంప్రదించాలి : మంత్రి తుమ్మల

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): పత్తి రైతులు పంటలను అమ్ముకోవడంలో ఎలాంటి జాప్యం చేయకూడదనే ఉద్దేశ్యంతో వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో పత్తి రైతుల సౌకర్యార్థం వాట్సాప్ సేవలు ప్రారంభించినట్టు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి సేవలను పొందాలనుకున్నా.. 8897281111 వాట్సాప్ నంబర్‌ను సంప్రదించాలని మంత్రి సూచించారు. ఈ వాట్సాప్ ద్వారా రైతులు ఫిర్యాదు చేసినా మార్కెటింగ్ శాఖ అధికారులు సత్వరమే పరిష్కరిస్తారని తెలిపారు. పింజ రకము(బీబీ మోడ్) పత్తికి క్వింటాల్‌కు రూ.7521 (పింజ పొడువు మి.మీ 29.5 నుంచి 30.5, మైక్రోనీర్ విలువ 3.5నుంచి 4.3గా), పింజ రకము(బీబీ ఎస్‌పీఎల్) క్వింటాల్‌కు రూ.7471(పింజ పొడువు 29.01 నుంచి 29.49, మైక్రోనీర్ విలువ 3.6 నుండి 4.8) గా, పింజ రకము(ఎంఈ సీహెచ్) క్వింటాల్‌కు రూ.7421 (పింజ పొడువు 27.05 నుంచి 28.5, మైక్రోనీర్ విలువ 3.5 నుంచి 4.7)గా పత్తికి కనీసం మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. పత్తిలో 12శాతం తేమ మించకుండా ఉండి, 8శాతం నుంచి 12 శాతం మధ్య ఉన్న పత్తికి మాత్రమే మద్దతు ధర లభిస్తుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

అగ్రియూనిట్స్ స్థాపించండి

మలేషియాలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హార్టీకల్చర్ అధికారుల బృందం మూడోరోజు పర్యటన కొనసాగుతున్నది. శుక్రవారం ఆయన ఆ దేశ వ్యవసాయశాఖ మంత్రి మహ్మద్‌బిన్‌తో ఆయన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఫెల్టా చైర్మన్ అహ్మద్ షబేరీ చీక్, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అగ్రియూనిట్స్ స్థాపనకు అనుకూలమని చెప్పారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టాలని మలేషియా ప్రతినిధులను కోరగా, వారు సానుకూలంగా స్పందించారని తుమ్మల చెప్పారు. అలాగా తెనాషియా కంపెనీని సందర్శించారు.

కాల్మొక్తం సారూ.. పత్తి కొనండి!

- పత్తి రైతులకు తప్పని పడిగాపులు
- ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాల ప్రారంభం
- పత్తి కొనుగోలు చేయని సీసీఐ అధికారులు
- కలెక్టర్ కాళ్లు మొక్కి విన్నవించిన రైతులు
- అయినా కొనకపోవడంతో రోడ్డెక్కి నిరసన

ఆదిలాబాద్‌లో పంట కొనుగోలు చేయాలంటూ కలెక్టర్‌ను కోరుతున్న రైతులు

ఆదిలాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : అది ఆదిలాబాద్ మార్కెట్ యార్డు.. శుక్రవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామని అధికారులు చెప్పడంతో వందలాది మంది రైతులు దాదాపు 300 వాహనాల్లో పత్తిని తీసుకుని వచ్చారు. పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కలెక్టర్ రాజర్షి షా కూడా వచ్చారు. ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి కొనుగోళ్లు ప్రారంభించారు. కలెక్టర్ రాజర్షి షా సమక్షంలో అధికారులు వేలం పాట చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) క్వింటాల్‌కు రూ. 7521 ప్రకటించగా ప్రైవేట్ వ్యాపారులు కూడా వేలంలో పాల్గొన్నారు. 8 శాతం తేమతో క్వింటాల్‌కు రూ. 7150 వరకు చెల్లిస్తామని వేలం పాటలో వ్యాపారులు సూచించారు. ఇంతకు మించి చెల్లించేది లేదని తెగేసి చెప్పారు. ధర పెంచాలని కలెక్టర్ సూచించినా వ్యాపారులు ఒప్పుకోలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలెక్టర్ కోరినా వ్యాపారులు ససేమిరా అన్నారు. దీంతో విసిగిపోయి వెళ్లిపోతుండగా ఓ రైతు కలెక్టర్ కాళ్లు పట్టుకుని కాల్మొక్తం సారూ.. పత్తి కొనండి అంటూ బతిమిలాడిన దృశ్యం రైతుల కండ్లలో కన్నీళ్లు తెప్పించింది.

కొనుగోళ్లకు సీసీఐ నిరాకరణ

మార్కెట్‌యార్డులో ఒకటో కాంటా వద్ద రైతులు తీసుకువచ్చిన పత్తిలో తేమ శాతాన్ని పరిశీలించగా 19 శాతానికి పైగా వచ్చింది. 12 శాతానికి మించి ఎక్కువ తేమ ఉంటే నిబంధనల ప్రకారం కొనుగోలు చేయడం కుదరదని సీసీఐ అధికారులు సూచించారు. దీంతో సీసీఐ కొనుగోళ్లు సైతం నిలిచిపోయాయి. తేమతో సంబంధం లేకుండా సీసీఐ పంటను కొనాలని రైతులు కోరినా వినలేదు. ధర విషయంలో ప్రైవేట్ వ్యాపారులు క్వింటాల్‌కు రూ. 7150 మాత్రమే చెల్లిస్తామని పట్టు వీడకపోవడంతో ఉదయం 10 గంటలకు ప్రారంభంకావాల్సిన పంట కొనుగోళ్లు రాత్రి 7 గంటలైనా ప్రారంభం కాలేదు.

రూ. 7200 మించి చెల్లించలేం..

తేమ ఎక్కువగా ఉందని సీసీఐ కొనుగోళ్లకు నిలిపివేయగా కలెక్టర్ రాజర్షి షా, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రైవేట్ వ్యాపారులతో ధర ఎక్కువ చెల్లించాలని సూచించారు. వారు ఒప్పుకోలేదు. కలెక్టర్ మార్కెటింగ్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యాపారులతో మరోసారి చర్చలు జరిపారు. వారు చివరకు 8 శాతం తేమతో క్వింటాల్‌కు రూ.7200 చొప్పున కొనుగోలు చేస్తామని సూచించారు. అధికారులు తేమతో సంబంధం లేకుండా క్వింటాల్‌కు రూ.7200 చెల్లించాలని కోరారు. ఇందుకు వారు ఒప్పుకోకపోవడంతో కొనుగోళ్లలో ప్రతిష్టంభన నెలకొన్నది. సాయంత్రం ఆరు గంటల వరకు వ్యాపారులతో కలెక్టర్‌రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం చర్చలు జరిపినా ఫలితం రాలేదు.

కలెక్టర్ వాహనాన్ని అడ్డుకున్న రైతులు..

మధ్యాహ్నం సమయంలో కలెక్టర్ తిరిగివెళ్తుండగా రైతులు వాహనానికి అడ్డంగా నిల్చున్నారు. ఓ రైతు కలెక్టర్ కాళ్లుమొక్కి పత్తి కొనుగోలు చేయాలని కోరాడు. మార్కెట్‌యార్డు ఎదుట, పాత జాతీయ రహదారి పంజాబ్ చౌక్ వద్ద రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ ప్రభుతం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పంట కొనుగోళ్లు రాత్రి వరకు జరుగకపోవడంతో వందలాది మంది రైతులు తిండి, తిప్పలు లేక ఇబ్బందులు పడ్డారు.

ధర ఏమాత్రం సరిపోదు

నేను పది ఎకరాల భూమి కౌలుకు తీసుకుని పత్తి సాగుచేస్తున్నాను. ఎకరాకు రూ. 60వేల పెట్టుబడి అయింది. 40 క్వింటాళ్ల పత్తిని అమ్ముడానికి మార్కెట్‌యార్డుకు గురువారం రాత్రి తీసుకువచ్చాను. ఉదయం పత్తి అమ్ముకుని పోదామంటే తేమ ఎక్కువ ఉందని సీసీఐ అధికారులు పంటను కొనుగోలు చేయడం లేదు. ప్రైవేట్ వ్యాపారులు ఇచ్చే రూ.7200 ఏమాత్రం సరిపోదు. క్వింటాలుకు కనీసం రూ.8 వేలు ధర చెల్లించాలి. - దయాకర్ రెడ్డి, రామాయి, ఆదిలాబాద్ రూరల్

మొదటి కోతలో తేమ సహజం

పంట మొదటి కోత ప్రారంభంలో సహజంగా తేమశాతం ఎక్కువగా ఉంటుంది. ఇందులో రైతుల తప్పు ఏమున్నది. పంటను ఎండపెట్టి తీసుకువచ్చినా తేమశాతం తగ్గడం లేదు. ఉదయం 6 గంటలకు పత్తిని మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చినా సాయంత్రం 6 గంటలు దాటినా కొనుగోలు చేయలేదు. సీసీఐ అధికారులు తేమ 12 శాతం కంటే ఎక్కువ ఉందని పంటను కొంటలేరు. ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధర చెల్లిస్తామంటున్నారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. - రవి, పూసాయి, ఆదిలాబాద్ రూరల్

నిజామాబాద్ జిల్లా పొతంగల్ హెగ్డోలి సొసైటీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

సోయా రైతుల ఆందోళన

పొతంగల్, అక్టోబర్ 25: కొనుగోలు కేంద్రంలో కాంటా వేసి తరలించిన సోయాలను ఐదు రోజుల తర్వాత తిప్పి పంపడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలంలోని హెగ్డోలి సొసైటీ ఎదుట శుక్రవారం ధర్నాకు దిగారు. తేమ శాతం చూశాకే కొన్నారని, ఇప్పుడేమో బాలేవని తిప్పి పంపించడమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. ప్రభుత్వం బేషరతుగా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

- గూడ్స్ లైన్‌ను రద్దు చేయాలని రాస్తారోకో

నూతనంగా నిర్మించనున్న రైల్వే గూడ్స్ లైన్‌ను రద్దు చేయాలని హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ధర్మసాగర్, ఎలుకుర్తి, ఉనికిచర్ల గ్రామాల రైతులు శుక్రవారం మండలం సమీపంలోని ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. కేంద్రప్రభుత్వం, రైల్వే శాఖ స్పందించి, ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. -ధర్మసాగర్,

రైతు భూమికి వేలం నిర్వహిస్తున్న ఎన్‌డీసీసీ బ్యాంక్ అధికారులు

రుణం కట్టలేదని రైతు భూమి వేలం

- రూ.14 లక్షల అప్పుకు 7.10 ఎకరాల భూమి స్వాధీనం

బిచ్కుంద, అక్టోబర్ 25: బ్యాంకు రుణం కట్టలేదని రైతు భూమిని స్వాధీనం చేసుకున్న బ్యాంక్ అధికారులు వేలం వేశారు. ఈ ఘటన శుక్రవారం కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం నాగల్‌గావ్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ రైతు తనకున్న 7.10 ఎకరాల భూమిని 2016లో జుక్కల్‌లోని నిజామాబాద్ కేంద్ర సహకార బ్యాంక్ (ఎన్‌డీసీసీబీ)లో తనఖా పెట్టి రూ.6 లక్షల రుణం తీసుకున్నాడు. రుణం తిరిగి చెల్లించడంలో విఫలమయ్యాడు. ప్రస్తుతం ఆ రుణం అసలు, వడ్డీ కలిపి మొత్తం రూ.14 లక్షలకు చేరింది. లోన్ చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు పలుమార్లు నోటీసులు పంపించారు. స్పందన లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్టు గురువారం రైతు పొలం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆ భూమిని విక్రయానికి పెట్టిన బ్యాంక్ ఉన్నతాధికారులు.. నాగల్‌గావ్‌లో వేలం పాట నిర్వహించారు. ఇద్దరు రైతులు మాత్రమే వేలంలో పాల్గొన్నారు. రుణం మొత్తం రూ.14 లక్షలు ఉన్నందున మొత్తం భూమిని కాకుండా ఎకరం మాత్రమే విక్రయిస్తామని బ్యాంకర్లు చెప్పడంతో సదరు రైతులు వెనుదిరిగారు. దీంతో వేలం ప్రక్రియ నిలిచిపోయింది.

గద్వాల కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

రైతుభరోసా, రుణమాఫీ చేయాలని డిమాండ్

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు, రైతులు

గద్వాల/గద్వాల రూరల్, అక్టోబర్ 25 : జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత నెలకొన్నది. రుణమాఫీతోపాటు రైతుభరోసా చెల్లించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు రైతులు భారీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. రైతులను కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా పోలీసులు మెయిన్ గేట్ వద్దే అడ్డుకోవడంతో అక్కడే ధర్నా చేపట్టారు. అనంతరం రైతులు గేట్‌ను తీసుకొని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. రైతులు భారీగా రావడంతో కలెక్టర్ సంతోష్ బయటకు వచ్చి వినతిపత్రం అందుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

18 శాతం తేమ ఉన్నా పత్తిని కొనాలి

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో భారీగా కురిసిన వర్షాలతో పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితుల్లో నిర్ణీత ప్రమాణాల మేరకు 18 శాతం వరకు తేమ ఉన్నా.. మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినవేని రవీందర్‌రెడ్డి శుక్రవారం కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని లేఖలో విజ్ఞప్తిచేశారు.